క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపల సినీ నటి రాశి

తిరుమల : తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సినీ నటి రాశి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

కలెక్టర్‌ను కలిసిన సిల్వికల్చరిస్ట్



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న నరేంద్ర

తిరుపతి అర్బన్ : జిల్లా స్టేట్ సిల్వికల్చరిస్ట్ (బయోట్రిమ్)గా బాధ్యతలు చేపట్టిన జి.నరేంద్ర (ఐఎఫ్ఎస్)గురువారం కలెక్టరేట్ మర్యాద పూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. ఆయనకు మొక్కను బహూకరించారు.

ఇరిగేషన్ డీఈఈగా రెడ్డి సురేష్



చంద్రగిరి : ఇరిగేషన్ డీఈఈగా రెడ్డి సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి ఈఈ వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



నగదు అందిస్తున్న సంఘం సభ్యులు

పాకాల : మండలంలోని హైస్కూల్ గేటు వద్ద మరణించిన కె.మంగమ్మ(57) అనే వృద్ధురాలి అంత్యక్రియలకు గురువారం శ్రీవరసిద్ధి వినాయక సేవా సంఘం సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. వారు మాట్లాడుతూ పేదల దహన సంస్కారాలకు రూ.10వేలు అందిస్తున్నట్లు వెల్లడించారు. సహాయం కావాల్సినవారు 9666678269 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పేదలకు నాణ్యమైన వైద్యం



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి

చంద్రగిరి : ప్రభుత్వాస్పత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి ఆదేశించారు. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. పరికరాలు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సూపరింటెండెంట్ అరుణ పాల్గొన్నారు.

లాభసాటి సేద్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

భాకరాపేట : లాభసాటి సేద్యంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారి ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం నెరబైలు, చింతగుంట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు.

మానవ అక్రమ రవాణా హేయం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, ఎంఈఓలు

రామచంద్రాపురం: మానవ అక్రమ రవాణా హేయమని, నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. గురువారం సెంటర్ ఫర్ సస్టైయినబుల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రామాంజనేయులు చేతులమీదుగా పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బానిసత్వాన్ని అంతం చేసినప్పుడే ప్రజలందరూ స్వేచ్ఛగా జీవించగలరని వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైంస్లాట్ టిక్కెట్లు ఉంటే సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టిక్కెట్లు లేని వారికి 8 గంటల సమయం పడుతోంది.

నాడు ధైర్యం.. నేడు దైన్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద బిడ్డలు ప్రశాంతంగా చదువుకునేవారు.. కార్పొరేట్ కళాశాలల్లో సైతం ధీమాగా అడ్మిషన్ పొందేవారు.. ఉజ్వల భవితకు బంగారుబాటలు వేసుకునేవారు.. ఎలాంటి ఆలోచనలు లేకుండా విద్యాభ్యాసం పైనే దృష్టికి కేంద్రీకరించేవారు.. సకాలంలో 'విద్యాదీవెన' అందుతుండడంతో తల్లిదండ్రులు ఠంచన్‌గా ఫీజులు చెల్లించేసేవారు.. అయితే కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి నిరుపేద అమ్మానాన్నలకు కష్టాలు తప్పడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేయడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకవైపు కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి.. మరోవైపు పిల్లల ఆందోళనతో దిక్కుతోచని స్థితి ఎదురవుతోంది. ఒకప్పటి ధైర్యం.. ఇప్పుడు దైన్యంగా మారిపోయింది.

– తిరుపతి సిటీ

నియోజకవర్గంలో 'విద్యాదీవెన' వివరాలు

కోర్సు	విద్యార్థుల సంఖ్య	అందాల్సిన మొత్తం
ఎంబీబీఎస్	318	రూ.40.22లక్షలు
బీటెక్	2,897	రూ.7.64కోట్లు
యూజీ (అన్నికోర్సులు)	4,301	రూ.5.16కోట్లు
పీజీ	1,805	రూ.2.88కోట్లు

- పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 'విద్యాదీవెన' కింద సకాలంలో ఆర్థిక సాయం
- మహోన్నత పథకానికి మంగళం పలికిన కూటమి సర్కార్
- ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్న కళాశాల యాజమాన్యాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు
- నగదు కోసం నానా అవస్థలు పడుతున్న తల్లిదండ్రులు

భయం వేస్తోంది



మా అబ్బాయి ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇంతవరకు రెండు దఫాలుగా రావాల్సిన విద్యాదీవెన నగదు రాలేదు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటోంది. గతంలో ఏటా రూ.25,200లను నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. వెంటనే కళాశాలకు ఫీజు చెల్లించేవాళ్లం. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా అందించలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే, మా బిడ్డ చదువును కొనసాగించగలమా అని భయమేస్తోంది. - సూర్యనారాయణ, విద్యార్థి తండ్రి

కడుపు కొడుతున్నారు



మా అమ్మాయి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. విద్యాదీవెన పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిపివేసి పేద విద్యార్థుల కడుపు కొడుతున్నారు. ఇకపై ఉన్నత విద్య పేద పిల్లలకు అందే పరిస్థితి ఉండదేమో. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా విద్యాదీవెన అందించింది. కళాశాలలు ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తోంది. ఫీజు కట్టలేక కొట్టుమిట్టాడుతున్నాం. ఇప్పటికే కళాశాల యాజమాన్యం ఫీజు కోసం ఒత్తిడి తెస్తోంది. రోజూ మెసేజ్‌లు పంపుతున్నారు. ఎలా చేయాలో అర్థం కావడంలేదు. - సరస్వతమ్మ, విద్యార్థిని తల్లి

బాబును నమ్మడమే తప్పు



మా అమ్మాయి ఎంసీఏ సెకండ్ ఇయర్ చదువుతోంది. జగనన్న పాలనలో మాకు ప్రతి ఏడాది విద్యాదీవెన అందించి ఆదుకున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏడాది ఇప్పటి వరకు విద్యాదీవెన అందలేదు. కళాశాల నుంచి ఫీజు కట్టాలంటూ ఫోన్లు వస్తున్నాయి. మా ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. మా భర్త ఆటో డ్రైవర్. వచ్చే ఆదాయం కుటుంబ పోషణకే సరిపోతుంది. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. చంద్రబాబును నమ్మడమే మేము చేసిన తప్పు. - పరమేశ్వరి, విద్యార్థిని తల్లి

ఫీజు కట్టలేకున్నాం



మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు బీఎస్సీ నర్సింగ్, మరొకరు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నారు. గత ప్రభుత్వంలో జగనన్న విద్యాదీవెన పథకం ప్రవేశపెట్టి క్రమం తప్పకుండా ఫీజుకు సరిపడా ఆర్థిక సహాయం తల్లుల ఖాతాలలో జమ చేసేవారు. కానీ ప్రస్తుత సర్కారు పట్టించుకోలేదు. ఇప్పటికే అందాల్సిన విద్యాదీవెన అందకపోవడంతో పిల్లల ఫీజులు కట్టలేక నరకం అనుభవిస్తున్నాం. కాలేజీ వాళ్ల ఒత్తిడి ఎక్కువైంది. అప్పు కూడా పుట్టడం లేదు. ఎలా ఫీజులు కట్టాలో అర్థం కావడం లేదు. - రంగనాథం, విద్యార్థి తండ్రి

అప్పు చేయాల్సి వస్తోంది



మా అబ్బాయి డిగ్రీ చదువుతున్నాడు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫీజు కట్టేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. ఏటా కాలేజీ ప్రారంభమైన నెలలోనే విద్యాదీవెన, వసతి దీవెన కింద డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం మాలాంటి పేదలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఒకపక్క కాలేజీ వాళ్లు ఫీజుల కట్టాలని వేధిస్తున్నారు. దీంతో పిల్లలు భయపడిపోతున్నారు. చివరకు ఫీజు కట్టేందుకు అప్పు చేయాల్సి వస్తోంది. - అనసూయమ్మ, విద్యార్థి తల్లి

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని ఓటేరు పంచాయతీ గంగిరెడ్డుల కాలనీలోకి వరద నీరు చేరింది. గురువారం ఈ మేరకు బాధితులను తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పరామర్శించారు. బియ్యం, పప్పు, ఆయిల్, ఎర్రగడ్డలు, ఉల్లిగడ్డలు, రవ్వ, శనగపిండి, మసాలా దినుసులతో కలిసి 14రకాల నిత్యావసర సరుకులను ప్రతి ఇంటికీ పంపిణీ చేశారు.

వెల్లివిరిసిన ఆనందం

మూడు రోజులుగా తిండీతిప్పలు లేకుండా అలమటించిన వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందించగానే వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. కష్టం ఉన్నప్పుడ ఆదుకున్నందుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, వైస్ ఎంపీపీ మాధవ రెడ్డి, సర్పంచ్ కోటీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బత్తల సుబ్రమణ్యం, రాజు యాదవ్, గంగిరెడ్డి, నాగభూషణం, ముదిరాజ్, కొత్తపాటి మునీశ్వరరెడ్డి, చెంచు మోహన్ యాదవ్ పాల్గొన్నారు.

జేబీ రమణకు పరామర్శ

టీడీపీ నేత జేబీ రమణ తండ్రి మన్నెం కోటేశ్వరరావు బుధవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం రాత్రి శ్రీనివాసపురం పంచాయతీ పరిధిలోని జేబీ రమణ, జేబీ శ్రీనివాస్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

వర్షం.. టమాటాకు నష్టం

భాకరాపేట : మండలంలో నాలుగురోజులుగా కురుస్తున్న వర్షంతో టమాట పంటకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. ఆకులు రాలిపోతున్నాయని, దీంతో మొక్కలు బతికే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం కాస్త ఎండరావడతో టమాటకు మందులు పిచికారీ చేశారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో దాదాపు 100 హెక్టార్లలో టమాట సాగులో ఉందని అధికారులు వెల్లడించారు.



దెబ్బతిన్న టమాట పంట

స్త్రీ భద్రతపై కథల పోటీలు

తిరుపతి సిటీ : పోపూరి వెంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో భాగంగా స్త్రీకి సామాజిక భద్రతపై కథల పోటీలు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు డాక్టర్ యువశ్రీ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఇచ్చిన అంశంపై మూడు నుంచి ఐదు పుటలలోపు ఉండేలా కథను పంపాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు నవంబర్ 10వ తేదీ లోపు కథాంశాన్ని డాక్టర్ యువశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, పద్మావతి మహిళా వర్సిటీ, తిరుపతి చిరునామాకు పంపాలని సూచించారు. విజేతలకు నవంబర్ 27వ తేదీన జరిగే ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమంలో రూ.10వేల నగదు, జ్ఞాపిక అందించి సత్కరించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9885940011 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా అష్టోత్తర శత కలశాభిషేకం

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఘనంగా అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు ఉత్సవర్లకు 108 కలశాలతో అభిషేకం చేశారు. సాయంత్రం వేడుకగా ఆస్థానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం చెరువుముందరపల్లె గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య కంటి శిబిరం నిర్వహించనున్నారు. గురువారం ఈ మేరకు నిర్వాహకుడు పుట్టారెడ్డి డమరకనాథరెడ్డి రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్లజోళ్లతోపాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9440401706నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపులు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, నేతలు

తిరుపతి కల్చరల్ : నిబంధనలకు విరుద్ధంగా డీబీఆర్ ఆస్పత్రి పక్కన ఏర్పాటు చేసిన వైన్‌షాపును వెంటనే తొలగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు మద్య దుకాణం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గుడి, బడి, హాస్పిటల్స్, నివాసాల మధ్య స్థానికులు వ్యతిరేకించిన ప్రదేశాలలో మద్యం దుకాణాలు పెట్టకూడదన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి వైన్‌షాపులు తెరవడం సిగ్గుచేటని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచి మరీ కేటాయించడం ప్రభుత్వానికి తగదని స్పష్టం చేశారు. మద్యం మత్తులోనే హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని క్రైమ్ బ్యూరో తెలియజేస్తోందని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వమే లిక్కర్‌ను ప్రధాన ఆదాయ వనరుగా తీసుకోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే తిరుపతి జిల్లాకు అత్యధికంగా మద్యం షాపులను కేటాయించడం దారుణమన్నారు. దుకాణ యజమానులు కూడా ఆలోచించి ప్రజలకు ఇబ్బంది లేని చోట పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేణుగోపాల్, రమణ యాదవ్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో నాప్కాన్ పోటీలు



డాక్టర్ కాయిత్రీకి నగదు, ప్రశంసాపత్రం అందిస్తున్న డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ వర్సిటీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వేదికగా డాక్టర్ అల్లాడి మోహన్ ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర స్థాయి నాప్కాన్-2024 క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్విమ్స్ వీసీ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ క్విజ్ పోటీలతో విద్యార్థులలో నైపుణ్యం, పట్టుదల పెరుగుతుందన్నారు. అల్లాడి మోహన్ మాట్లాడుతూ క్విజ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు సంబంధిత కళాశాలల నుంచి పాల్గొన్నారని తెలిపారు. అమలాపురంలోని కోనసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) నుంచి డాక్టర్ ఎస్.భార్గవ్‌కుమార్ మొదటి బహుమతి సాధించి, రూ.5,000 నగదు బహుమతి పొందారని తెలిపారు. అలాగే ద్వితీయ బహుమతి రూ.2,500 ఎస్వీ వైద్యకళాశాలకు చెందిన డాక్టర్ కాయిత్రీ గెలుపొందారని చెప్పారు. విజేతలకు డైరెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

సమష్టి కృషితోనే నష్ట నివారణ



లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

తిరుపతి తుడా : అధికారులు, సిబ్బంది సమష్టి కృషి, ముందస్తు జాగ్రత్తలతోనే తుపాను సమయంలో నష్ట నివారణ సాధ్యమైందని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. గురువారం పూలవానిగుంట, కొరమేనుగుంట, ఆటోనగర్ ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరావాస కేంద్రాలను ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజులుగా 30 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. కొండలపై నుంచి నీరు అధికంగా రాకపోవడంతో కొంతమేర ఇబ్బందులు తప్పాయని వెల్లడించారు. లీలామహల్ కూడలి, కరకంబాడి మార్గంలో రోడ్లపైకి నీరు రాకుండా వినాయక సాగర్‌కు మళ్లించామని వివరించారు. లక్ష్మీపురం కూడలి, అండర్ బ్రిడ్జి కింద నీరు చేరిన వెంటనే మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు తొలగించామని చెప్పారు. ప్రస్తుతం పారిశుద్ధ్యం మెరుగునకు విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసీకుమార్, గోమతి, దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

రాజీవ్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి (అలిపిరి): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కొనియాడారు. గురువారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో రాజీవ్ గాంధీ స్మారక జాతీయ అవార్డులు ప్రదానం చేశారు. డాక్టర్ సుందర్ రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతామోహన్ మాట్లాడుతూ సాంకేతిక విప్లవంతోపాటు పంచాయతీ రాజ్ , ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలు తీసుకు వచ్చిన ఘనత రాజీవ్‌కే దక్కుతుందన్నారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అవార్డులు ప్రదానం చేశారు. కర్ణాటక ఫైనాన్స్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణస్వామి , మహిళా కాంగ్రెస్ నేత ప్రమీలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు



వ్యవసాయ కళాశాలలో వాల్మీకి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న డీన్, అధ్యాపకులు



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : కార్పొరేషన్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ రామాయణం రచించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవడం సంతోషంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, రవి, సెక్రటరీ రాధిక, మేనేజర్ హసీమ్ పాల్గొన్నారు.

ఎస్వీ వ్యవసాయ కళాశాలలో..

ఎస్వీ వ్యవసాయ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతి నిర్వహించారు. అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్‌వీ రమణ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జీవిత పయనాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహిస్తోందన్నారు. మహనీయుని జీవిత గాథ యావత్ జాతికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎంవీఎస్ నాయుడు, డాక్టర్ రెడ్డి శేఖర్, డాక్టర్ వేమన, డాక్టర్ చంద్రిక, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ మోహన్ నాయుడు, డాక్టర్ చలం పాల్గొన్నారు.

స్విమ్స్ ఆస్పత్రి కూడలిలో..

తిరుమల : స్విమ్స్ ఆస్పత్రి కూడలిలోని వాల్మీకి విగ్రహానికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నేత గుండాల గోపీనాథ్ రెడ్డి మాట్లాడుతూ మనిషి అనుకుంటే మహర్షి కాగలడు అని నిరూపించిన మహనీయుడు వాల్మీకి అని కొనియాడారు. కార్యక్రమంలో జల్లి మధుసూదనరావు, వాల్మీకి అసోసియేషన్ నేతలు గోపాల్ , నాగరాజు, నాగేశ్వరరావు , వెంకట కిషోర్, నాగేంద్ర, బీజేపీ నేతలు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి ,మల్లారపు రవిప్రసాద్, చిట్టిబాబు, కీర్తి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో ..

వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ సుబ్బరాయుడు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చంద్రగిరిలో..

చంద్రగిరి :మండలంలోని ఎం.కొంగరవారిపల్లెలో శ్రీవాల్మీకి బోయ సేవా సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ బోయ జాతి కీర్తికిరీటం వాల్మీకి మహర్షి అని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు శోభన్ బాబు, బాలయ్య, నాగరాజు, రెడ్డప్ప, షణ్ముగం, బాలాజీ, అజయ్, కేశవులు, చౌదరి, గుర్రమ్మ, బుజ్జి, శేఖర్ పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వాల్మీకి బోయ సేవా సంఘం సభ్యులు

బ్యాంక్ ఆఫ్ బరోడా / Bank of Baroda

కలికిరి బ్రాంచ్, డి.నెం.2-123, బ్రాహ్మణ వీధి, కలికిరి, అన్నమయ్య జిల్లా-517234. ఫోన్ నెం.9154 285 310

ఈ-వేలం పద్ధతిలో వాహనం వేలం ప్రకటన (సంక్షిప్త)

ఈ దిగువ చెప్పబడిన ఋణగ్రహీత బకాయి మొత్తము చెల్లింపులో విఫలమైనందున, బ్యాంక్ వారిచే 'ఋణగ్రహీతచే అమలు చేయబడిన తనఖా ఒప్పందము' క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఈ దిగువ చెప్పిన తిరిగి స్వాధీనము/జప్తు చేసిన వాహనమును "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే" & "అక్కడ ఏమి ఉన్నదో అదే" పద్ధతి పై వేలం వేయబడును.

ఋణగ్రహీత పేరు & చిరునామా / లోన్ అకౌంట్ నెం.	బకాయి మొత్తం	వాహనము వివరములు	రిజర్వు ధర రూ.	ఈఎండి ధర రూ.	కనీస బిడ్ పెంపుదల మొత్తం	అకౌంట్ పేరు & నెం ఐఎఫ్ఎస్‌సి కోడ్, బ్యాంక్ & బ్రాంచ్ పేరు
శ్రీ భీమవరం కళ్యాణ్, తండ్రి: బి.సిద్ధయ్య, ఇంటి నెం. 4-78, భీమవరం, హరిజనవాడ, నరసింగాపురం-517102 చంద్రగిరి దగ్గర అకౌంట్ నెం. 16510600020754 & 16510400000819	రూ.23,55,484 + 16.10.2024 నుండి వడ్డీ + ఇతర ఖర్చులు మొదలవి. తేదీ వరకు (పైగా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును)	Vehicle : EICHER 2090 L-BUS 41 S BSVI (OMINI BUS) Reg no: AP 39 UM 5284 Chassis No: MC2FDLRTOPA616507 Engine No: E446CDNM062640 MFG Model: VE COMMERCIAL VEHICLES LTD Colour : BRILLIANT WHITE MFG Month/ Year: 01/2023	రూ.32,00,000 (ముప్పై రెండు లక్షల రూపాయలు మాత్రమే) + GST వర్తించును	రూ.3,20,000 (మూడు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)	రూ.10,000 (పది వేల రూపాయలు మాత్రమే)	NEW INTERMEDIARY ACCOUNT 16510015181219 BARB0KALIKI (Fifth letter-ZERO) BANK OF BARODA KALIKIRI BRANCH

ఆన్‌లైన్ పద్ధతి ద్వారా వాహనము వేలం కొరకు: https://bob.auctiontiger.net

ఈ-వేలం యొక్క తేదీ&సమయం: 20.11.2024, బుధవారం, మ॥ 11.00 గం.ల నుండి మ॥ 02.00 గం.ల వరకు, బిడ్ సమర్పించవలసిన చివరి తేదీ.18.11.2024, సోమవారం, సా॥ 04.00 గం.ల లోపు ఆసక్తి గల కొనుగోలుదారులు/బిడ్డర్లు వాహనాన్ని 06.11.2024 & 07.11.2024 న ఉ॥10.30 గం.ల నుండి సా॥04.00 గం.ల లోపు పార్కింగ్ యార్డు నందు తనిఖీ చేసుకోవచ్చును. (పద్మనాభయ్య పార్కింగ్ యార్డ్, పాత జిఎన్‌టి రోడ్డు, శ్రీదేవి రైస్‌మిల్ ప్రక్కన, తుమ్మూరు, నాయుడుపేట-524126)

ఆన్‌లైన్ వేలం ప్రక్రియ కోసం దయచేసి అధీకృత అధికారిని ఫోన్‌లో సంప్రదించండి.నెం.9154 285 310

దరఖాస్తులు బ్యాంక్ వారి వెబ్‌సైటు www.bankofbaroda.co.in నందు అప్‌లోడ్ చేయబడినవి & బ్రాంచ్ నందు కూడా లభించును కావున గమనించగలరు.

తేది : 17-10-2024, ప్రదేశం: కలికిరి

సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా